




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


సంచిక : 314 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 02-03 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## పాక్‌లో అమెరికా కాన్సులేట్ ముట్టడి

- పోలీసుల కాల్పుల్లో పది మంది మృతి
- ప్రధాన నగరాల్లో వెల్లువెత్తిన నిరసనలు
- ఇస్లామాబాద్‌లో 144 సెక్షన్ అమలు

కరాచీ,
ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి నిరసనగా పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. కరాచీలోని అమెరికా కాన్సులేట్ ముట్టడికి నిరసనకారులు ప్రయత్నించారు. రాళ్లు, కర్రలతో వందలాది మంది విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో పదిమంది మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నలుగురు పోలీసులు ఉన్నారు. నిరసనకారులు పోలీసులపై దాడికి దిగడంతో పరిస్థితిని అదుపు చేయడానికి టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లను ఉపయోగించాల్సి వచ్చిందని సీనియర్ పోలీసు అధికారి ఎస్ఎవీసపీ ఆసద్ రెజా

-మిగతా 2 లో



## నాగపూర్‌లో విషాదం

- పేలుడు పదార్థాల పరిశ్రమలో భారీ ప్రమాదం
- 17 మంది మృతి, 18 మందికి తీవ్రగాయాలు

నాగ్‌పూర్
మహారాష్ట్ర నాగపూర్ జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. కటోల్ ప్రాంతంలోని మైనింగ్, పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ కర్మాగారం (ఎస్‌బిఎల్)లో ఆదివారం తెల్లవారుజామున భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాద సమయంలో విధుల్లో ఉన్న సుమారు 17 మంది కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీ భవనం కొంతమేర కుప్పకూలడంతో మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారు. రసాయనాల మిక్సింగ్ ప్రక్రియ జరుగుతుండగా మంటలు చెలరేగి భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో, ఫ్యాక్టరీలోని కొంత భాగం కుప్పకూలడంతోపాటు పరిసర ప్రాంతా

-మిగతా 2 లో



## సెమీస్‌కు భారత్

- విండీస్‌పై 5 వికెట్లతో ఘన విజయం
- ఛేదనలో దంచికొట్టిన సంజు శాంసన్
- వెస్టిండీస్195/4భారత్ 199/5

ఉత్కంఠకు తెరపడింది. కరీబియన్లతో నాకౌట్ ఫైట్‌లో ఆతిథ్య భారత్ పైచేయి సాధించింది. ఈడెన్‌గార్డెన్స్‌లో విండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమ్ ఇండియా టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఛేదనలో సంజు శాంసన్ (97 నాటౌట్) అర్ధ సెంచరీతో చెలరేగగా, తిలక్ వర్మ (27) రాణించాడు. టీ20 ప్రపంచకప్ తొలి సెమీస్‌లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తలపడనుండగా.. రెండో సెమీస్‌లో భారత్‌తో ఇంగ్లాండ్ ఢీకొట్టనుంది.




‘గ్రేటర్’ ఎన్నికలే లక్ష్యంగా సీఎం వ్యూహం

# 99 రోజుల పార్టీ ప్రణాళిక

### రంగారెడ్డిపైనా పట్టుకు స్కెచ్

- బలహీనంగా ఉన్న చోట పుంజుకునేందుకు ప్రణాళికలు
- మున్సిపోల్స్‌లో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ కార్యక్రమాల ఏకరువు.. పార్టీ బలోపేతమే లక్ష్యం

హైదరాబాద్
గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ శరవేగంగా పావులు కదుపుతోందా? అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు అత్యధిక స్థానాలు కట్టబెట్టిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో హస్తం పార్టీని బలోపేతం చేయటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారా? అంటే అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు నిర్వహించిన ప్రజా పాలన, బేగంపేటలో నిర్వహిస్తోన్న ప్రజావాణి కార్యక్రమాలు ఉండగాడ ఇప్పుడు మళ్లీ ’99 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్’

-మిగతా 2 లో



## గురిచూసి దెబ్బ

- ఖమేనీ కదలికలపై కొన్ని నెలలుగా నిఘా
- పక్కా సమాచారం సేకరించిన ఇజ్రాయెల్, అమెరికా గూఢచారులు
- శనివారం ఉదయం సలహాదారులతో భేటీ అవుతున్నట్లు గుర్తింపు
- వెంటనే ఆయన నివాసంపై 30 బాంబులు కుమ్మరించిన ఇజ్రాయెల్

వాషింగ్టన్,
ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అంతమొందించటంలో అమెరికా, ఇజ్రాయెల్‌లు పక్కా ప్రణాళికతో ముందుకు కదిలాయి. ఖమేనీ ఎప్పుడు ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఆయనను ఎవరు కలుస్తున్నారు? అనే సమాచారాన్ని అత్యంత కచ్చితత్వంతో సేకరించి, గురిచూసి దాడి చేశాయి. ఖమేనీయే లక్ష్యంగా ఈ రెండు దేశాలు కొన్ని నెలలుగా అత్యంత రహస్య ఆపరేషన్ నిర్వహించినట్లు అమెరికా మీడియా పేర్కొంది. అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ, ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ ఏజెంట్లు ఎవరికి వారు ఖమేనీ సమాచారాన్ని సేకరిస్తూ.. దానిని ఎప్పటికప్పుడు పరస్పరం పంచుకున్నారు. ఖమేనీని అంతం చేయటంలో ఆంత్రోపిక్

-మిగతా 2 లో



## నేడు అనంతగిరికి రాహుల్



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరు
- పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం
- డీసీసీ అధ్యక్షులు, కుటుంబ సభ్యులతో ముఖాముఖి
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీతోనూ భేటీ

హైదరాబాద్/వికారాబాద్,
ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం వికారాబాద్ జిల్లాలోని అనంతగిరికి రానున్నారు. స్థానిక హరిత రిసార్ట్స్‌లో జరుగుతున్న తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఎయిరిండియా విమానంలో ఉదయం 9.15 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి

-మిగతా 2 లో

## వెలుగుమట్ల పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరు
- పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం
- డీసీసీ అధ్యక్షులు, కుటుంబ సభ్యులతో ముఖాముఖి
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీతోనూ భేటీ

ఖమ్మం,
ఖమ్మం సమీపంలోని వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలందరికీ ఈనెల 15వ తేదీలోగా నివాసయోగ్యంగా ఉన్న ప్రాంతాల్లో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వెలుగుమట్లలో భూదాన్‌కు సంబంధించిన 31 ఎకరాల భూముల్లో నిరుపేదలతోపాటు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, గతంలో ఇందిరమ్మ ఇళ్లు తీసుకున్న వారు పొరుగు జిల్లాల నుంచి కూడా వచ్చి

-మిగతా 2 లో





## ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతం

- అమెరికా, ఇజ్రాయిల్ దళాల దాడిలో కుటుంబ సభ్యులూ మృతి
- ధ్రువీకరించిన ఇరాన్
- 40 రోజులపాటు సంతాప దినాలు

టెహ్రాన్
అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి ప్రపంచం రగులుకుంటోంది. మధ్యప్రాచ్యం నెత్తుటి మడుగులో తడిసి ముద్దవుతోంది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యతో అమెరికా, ఇజ్రాయిల్ తమ సామ్రాజ్యవాద కుట్రలను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాయి. అమెరికా, ఇజ్రాయిల్ ఈ రెండు శక్తులు దశాబ్దాలుగా మధ్యప్రాచ్యాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నాయి. తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక ప్రజల నెత్తుటిని పారిస్తున్నాయి. ఖమేనీ హత్య ఈ కుట్రలో భాగమే. ఇరాన్ స్వయంప్రతిపత్తిని, సార్వభౌమత్వాన్ని కాలరాసే ప్రయత్నమేనని పలువురు విమర్శిస్తున్నారు. ఇరాన్‌లోని పాఠశాలపై ఇజ్రాయిల్ దాడులు ఇరాన్, అమెరికా స్థావరాలపై ప్రతీకార దాడులు, ఇవన్నీ మధ్యప్రాచ్యాన్ని, అగ్నిగుండంగా మారుస్తున్నాయి. అమాయక ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు ఈ యుద్ధ జ్వాలల్లో ఆహుతవుతున్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ 86 ఏళ్ల అయతుల్లా అలీ ఖమేనీ హత్యకు గురయ్యారు. అమెరికా, ఇజ్రాయిల్ సైన్యాల సంయుక్త దాడిలో శనివారం ఆయన మృతి చెందారు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం ఉదయం ధ్రువీకరించింది. 40 రోజుల పాటు సంతాప దినాలను ఇరాన్ ప్రకటించింది. ఖమేని మృతితో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. కన్నీళ్లతో ఆ దేశ మీడియా ప్రసారాలు చేసింది. అలాగే సౌదీ అరేబియా, బ్రహెయిన్, ఖతార్‌తో సహా పలు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు దాడి చేశాయి. దీంతో పశ్చిమాసియా మండుతోంది. ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన ఖమేనీ, అంచెలంచెలుగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. సాధారణ షియా మత ప్రబోధకుడిగా ఆయన జీవితం మొదలైంది. ఇరాన్‌లో రాజు మహ్మద్ రజా షా పహల్వీ పాలన జరుగుతుండగానే రహస్యంగా ఇస్లామిక్ విప్లవానికి

-మిగతా 2 లో

## ఇండ్లను ధ్వంసం

# చేయొద్దు

### మూసీ సుందరీకరణ చేయండి



- ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వమే అనుమతిచ్చింది: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- గంధంగూడ నుంచి మధుపార్క్ వరకు మూసీ బాధితులకు అండగా పాదయాత్ర

గండిపేట్
మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను ధ్వంసం చేయొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ సర్కిల్‌లోని హైదర్షాకోట్ గంధం గూడ, కేకే నగర్-2, విగేశ్వర్ నగర్ కాలనీ నుంచి మధు పార్క్ వరకు మూసీ సుందరీకరణలో భాగంగా ఇండ్లను కోల్పోతున్న బాధితు లతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో బాధితులతో మాట్లా డుతూ వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మూసీ సుందరీకరణ ముఖ్యమే కానీ ఇండ్లను ధ్వంసం చేయకూడదని

-మిగతా 2 లో

### సమాచార లోపంతోనే

## గందరగోళం

- ఆ భూములు శారదా పీఠానికే చెందుతాయి
- మాపై విపక్షాల దుష్ప్రచారం
- బాపు ఘాట్’ విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకు: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్/
హైదరాబాద్ కోకాపేటలోని శారదా పీఠం భూముల వ్యవహారంలో సమాచార లోపం వల్లే గందరగోళం తలెత్తిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆ భూములు పీఠానికే చెందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆదివారం కోకాపేటలోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించి.. అక్కడి రాజశ్యామల అమ్మవారి ఆలయం, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్

-మిగతా 2 లో

## పాక్‌లో అమెరికా కాన్సులేట్ ముట్టడి

మొదటి తరువాయి

వెల్లడించారు. సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను పెంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిరసనల నేపథ్యంలో కాన్సులేట్‌కు వెళ్లే అన్ని దారులను మూసేశారు. నిరసనకారులపై కాన్సులేట్‌కు కాపలా ఉన్న అమెరికా భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారన్న వార్తలను పాక్ ప్రభుత్వం ఖండించింది. మరోవైపు ఇస్లామాబాద్, లాహోర్‌ల్లోనూ నిరసనకారులు రోడ్లపైకి వచ్చి పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో 144 సెక్షన్ విధించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులకు వ్యతిరేకంగా లాహోర్‌లోని ప్రెస్ క్లబ్ వద్ద నిరసనలు చేపట్టారు. లాహోర్, ఇస్లామాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కరాచీ, లహోర్, పెషావర్‌ల్లోని అమెరికా కాన్సులేట్ జనరల్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలను, అలాగే ఇస్లామాబాద్‌లోని యూఎస్ ఎంబసీ వద్ద నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ తెలిపింది.

## నాగపూర్‌లో విషాదం

మొదటి తరువాయి

లు దద్దరిల్లాయి. ఆ పేలుడుకు సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగపూర్‌లోని స్థానిక ఆసుపత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని వైద్య వర్గాలు తెలిపాయి. మృతదేహాలు గుర్తుపట్ట లేనంతగా కాలిపోవడంతో గుర్తింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. ఈ ఘోర ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం ఫడ్నవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ సంతాపాన్ని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించడంతోపాటు, ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. భద్రతా ప్రమాణాల ఉల్లంఘన వల్లే ఈ ప్రమాదం జరిగిందా లేదా ఇతర సాంకేతిక లోపాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు పిఎంఎన్‌ఆర్‌ఎఫ్ కింద రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియాను అధికారులు ప్రకటించారు.

## గురిచూసి దెబ్బ

మొదటి తరువాయి

సంస్థకు చెందిన క్లాడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను కూడా వాడుకున్నట్లు తేలింది.

**శనివారం మీటింగ్..వెంటనే దాడి**

ఖమేనీ తన సలహాదారులు, మిలిటరీ ఉన్నతాధికారులతో శనివారం మూడు సమావేశాల్లో పాల్గొనబోతున్నట్లు అమెరికా, ఇజ్రాయెల్ గూఢచారులు గుర్తించారు. ఆ సమావేశాలు ఎక్కడ జరగబోతున్నాయన్న కచ్చితమైన సమాచారం తెలియనప్పటికీ.. శనివారం సాయంత్రం అత్యంత కీలక సమావేశం జరుగుతుందని ఇరాన్‌లోని సీఐఏ ఏజెంట్లు తొలుత తమ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే, ఆ సమావేశం శనివారం ఉదయమే జరుగుతోందని మోసాద్ ఏజెంట్లు కచ్చితమైన సమాచారం సేకరించి, స్వదేశంతోపాటు అమెరికాకు చేరవేశారు. ఈ అవకాశం చేజారితే ఖమేనీ రహస్య ప్రదేశానికి వెళ్లిపోవచ్చని భావించిన రెండు దేశాలు.. వెంటనే రంగంలోకి దిగాయి. అమెరికా మిలిటరీతో సమన్వయం చేసుకొంటూ ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఖమేనీ నివాసంపై ఒకేసారి 30 బాంబులను కుమ్మరించాయి. దీంతో ఆ భవనం తునాతునలు అయిపోయింది. దాడికి ముందు సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీతోపాటు మరీ కీలక నేత షంఖానీతో ఖమేనీ సమావేశమైనట్లు ఇరాన్ అధికార వర్గాలు తెలిపాయి.

## నేడు అనంతగిరికి రాహుల్

మొదటి తరువాయి

చేరుకోనున్న రాహుల్.. అక్కడి నుంచి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో అనంతగిరికి వెళతారు. అక్కడ తొలుత టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులతో కొద్దిసేపు ప్రత్యేకంగా సమావేశమవుతారు. అనంతరం డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై వారికి దిశానిర్దేశం చేస్తారు. దీంతోపాటు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన విషయాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులతో పాటు వారి కుటుంబ సభ్యులతో కూడా రాహుల్ ముఖాముఖి మాట్లాడనున్నట్లు, వారితో కలిసి ఫొటోలు దిగనున్నట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం ఉదయం 8 గంటలలోగా డీసీసీ అధ్యక్షులు తమ కుటుంబ సభ్యులను శిక్షణ శిబిరం వద్ద అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకుల నుంచి సమాచారం అందింది.

**రాజ్యసభ స్థానాలపై నిర్ణయం!**

అనంతగిరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పీసీసీల రాజకీయ వ్యవహారాల కమిటీల (పీఏసీ)లతో రాహుల్‌గాంధీ వేర్వేరుగా సమావేశం కానున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశ ం ఉంద ని తెలుస్తోంది. అయితే పీఏసీతో భేటీలో ఈ అంశంపై చర్చ ఉండదని, అది కేవలం ఫొటో సెషన్‌గా మాత్రమే ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, సాయంత్రం 4.30 గంటలకు రాహుల్ అక్కడి నుంచి బయలుదేరి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు తిరిగి ఢిల్లీకి వెళతారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌గాంధీ వికారాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలంతా అనంతగిరి బాట పట్టారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం మధ్యాహ్నామే అనంతగిరి చేరుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి, సంఘటన్ సృజన్ అభియాన్ చైర్మన్ సచిన్‌రావు తదితరులు హరిత రిసార్ట్స్‌లో రాహుల్ పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాహుల్‌తోపాటు సీఎం రేవంత్ కూడా వస్తుండడంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతం

మొదటి తరువాయి

క్షేత్రస్థాయిలో పునాదులు వేసిన కీలక వ్యక్తుల్లో ఖమేనీ ఒకరు. 1979 ఫిబ్రవరిలో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చాక, రాజు పాలన అంతమైంది.

ఖమేనీ భేటీపై పక్కా సమాచారం..

ఇరాన్ అగ్రనేత ఖమేనీ కదలికలు.. షెడ్యూల్ పక్కాగా అమెరికా వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయన్నే లక్ష్యంగా చేసుకొని అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీని మొదలుపెట్టింది. శనివారం ఖమేనీ తన కీలక సలహాదారులైన షాంఖానీ, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీతో భేటీ అయ్యారు. ఈ సమావేశ సమాచారమే దాడులు చేసేలా అమెరికాను పురిగొల్పింది. నిఘా సంస్థ సిఐఎ కొన్ని నెలలుగా ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ సమన్వయంతో ఖమేనీ కదలికలపై నిఘా ఉంచింది. ఖమేనీ పాలన భవనాల్లో ఒకచోట ఈ భేటీ జరగనున్నట్లు గుర్తించారు. దీంతో అక్కడే దాడి చేయాలని అమెరికా, ఇజ్రాయిల్ భావించాయి. కాకపోతే ఆ భవన ప్రాంగణాల్లో ఎక్కడ ఖమేనీ ఉన్నారో ఆ దేశాల వద్ద కచ్చితమైన సమాచారం లేదు. ఖమేనీ భేటీ కూడా శనివారం సాయంత్రం జరగాల్సి ఉన్నట్లు సమాచారం ఉన్నా.. ఆ తర్వాత దాని షెడ్యూల్ ఉదయానికి మారినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో దాడి సన్నాహాలను వేగవంతం చేశాయి.

# సెమీస్‌కు భారత్

**–కోల్‌కతా**

ఉత్కంఠరేపిన సూపర్8 పోరులో వెస్టిండీస్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓపెనర్ సంజు శాంసన్ (97 నాటౌట్, 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ ఇన్నింగ్స్‌తో చెలరేగటంతో 196 పరుగుల లక్ష్యాన్ని భారత్ మరో 4 బంతులు ఉండగానే ఛేదించింది. తిలక్ వర్మ (27, 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (18), హార్దిక్ పాండ్య (17) విలువైన ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. రోస్టన్ ఛేజ్ (40, 25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హౌల్డర్ (37 నాటౌట్, 22 బంతుల్లో 2 ఫోర్లు,3 సిక్స్‌లు), రోవ్‌మాన్ పావెల్ (34 నాటౌట్, 19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఛేదనలో చెలరేగిన సంజు శాంసన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



**చెలరేగిన శాంసన్**

భారత్ లక్ష్యం 196 పరుగులు. భీకర ఫామ్‌లో ఉన్న భారత్‌కు పెద్ద కష్టం కాదు. కానీ అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10) రెండేసి బౌండరీలు బాదినా వికెట్ నిలుపుకోలేదు. 41/2తో భారత్ కష్టాల్లో కూరుకోగాడ సంజు శాంసన్‌తో కలిసి సూర్య కుమార్ యాదవ్ (18) విలువైన భాగస్వామ్యం నిర్మించాడు. పవర్‌ప్లే తర్వాత దూకుడుగా ఆడిన సూర్య, సంజు.. విండీస్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించారు. సూర్యకుమార్ యాదవ్ అవుటైనా.. తెలుగు తేజం తిలక్ వర్మ (27)తో కలిసి సంజు శాంసన్ అదరగొట్టాడు. ఈ ఇద్దరు నాల్గో వికెట్‌కు 42 పరుగులు జోడించారు. ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 26 బంతుల్లో సంజు శాంసన్ అర్థ సెంచరీ పూర్తి చేసుకోగా.. భారత్ మ్యాచ్‌పై పట్టు బిగించింది. పవర్‌ప్లేలో అకీల్ హుసేన్, మిడిల్ ఓవర్లలో షమర్ జోసెఫ్ వికెట్లు పడగొట్టి ఉత్కంఠ పెంచినా.. సంజు శాంసన్ ఓ ఎండ్‌లో బలంగా నిలబడ్డాడు. ఆఖర్లో హార్దిక్ పాండ్య (17) వికెట్ పడినా.. శివం దూబె (8 నాటౌట్)తో కలిసి సంజు శాంసన్ లాంఛనం ముగించాడు.

**విండీస్ సమిష్టిగా**

టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పవర్ హిట్టర్లతో కూడిన విండీస్ బ్యాటింగ్ లైనప్ సమిష్టిగా రాణించింది. ఓపెనర్లు షాయ్ హౌప్ (32), రోస్టన్ ఛేజ్ (40) తొలి వికెట్‌కు అదిరే ఆరంభం అందించారు. షిమ్రోన్ హెట్‌మయర్ (27), రూథర్‌ఫోర్డ్ (14) సిక్సర్లతో ఎదురుదాడి చేసినా.. ఎంతోసేపు వికెట్ నిలుపుకోలేదు. రోవ్‌మాన్ పావెల్ (34 నాటౌట్), జేసన్ హౌల్డర్ (37 నాటౌట్) ఐదో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో అందరూ మెరవటంతో విండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. భారత బౌలర్లలో జశ్‌ప్రీత్ బుమ్రా (2/36), వరుణ్ చక్రవర్తి (1/40), హార్దిక్ పాండ్య (1/40) వికెట్లు పడగొట్టారు.

## 99 రోజుల పార్టీ ప్రణాళిక

మొదటి తరువాయి

అంటూ సర్కారు ప్రకటించటం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అసెంబ్లీ, పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీ, మున్సిపల్ ఎలక్షన్లలో గెలుపు జెండాను ఎగరేసినప్పటికీ ఇప్పటికిప్పుడు జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు అధికార పార్టీ సంసిద్ధం కాకపోవటాన్నిబట్టి ఈ వాదన మరింత బలపడుతోంది. దీన్ని మరింత లోతుగా పరిశీలిస్తేఢ 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 99 రోజులపాటు నిర్వహించే ఈ ప్రోగామ్‌డతమకు అత్యంత కీలకమని, ప్రతీ రోజూ అమూల్యంగా భావించి పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. అయితే ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమమే కాదని, పార్టీని బలోపేతం చేసుకునేందుకు ఉద్దేశించిన ప్రోగ్రామ్ అని కాంగ్రెస్ నేతలే చెబుతుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ బలంగా ఉన్నట్టు కనబడుతోంది. కానీ అసెంబ్లీ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎలక్షన్ల వరకూ పరిశీలిస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో అది పట్టు సాధించలే కపోయింది. వాస్తవానికి ఇక్కడ ఆ పార్టీకి సరైన లీడర్లుగాని, క్యాడర్‌గానీ లేదు. ఈ



ప్రాంతంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా లేదు. ఫలితంగా మున్సిపోల్స్‌లో ఇక్కడ బీఆర్‌ఎస్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. మరోవైపు పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికల్లో కొన్ని చోట్ల ఎదురైన అనుభవాలు కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదు. సీనియర్ మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న పలు మున్సిపల్ ప్రాంతాల్లో హస్తం పార్టీ అపజయం పాలైంది. మంత్రి గడ్డం వివేక్ బాధ్యుడిగా ఉన్న క్యాతనపల్లిలో ఆ పార్టీ ఓటమి పాలైంది. మరో మంత్రి వాకిటి శ్రీహరి నియోజకవర్గ పరిధిలోని అమరచింత మున్సిపాల్టీ బీఆర్‌ఎస్ ఖాతాలో పడింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న వేములవాడలో కూడా కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. నారాయణపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఉన్నప్పటికీఢ అక్కడ బీజేపీ గెలిచింది. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమన్‌గల్, దేవరకద్ర తదితర చోట్ల కాంగ్రెస్‌కు ఇబ్బందికర పరిస్థితులేర్పడ్డాయి. గద్వాల, ఖానాపూర్, మహబూబాబాద్, వర్ధన్నపేట, ఇబ్రహీంపట్నం తదితర మున్సిపాల్టీల్లో అధికార పార్టీకి వ్యతిరేక పవనాలు వీచాయి. ఈ నేపథ్యంలో పార్టీ బలహీనంగా ఉన్న గ్రేటర్‌తోపాటు పలు జిల్లాలు, మున్సిపాల్టీల్లో పార్టీని బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు సీనియర్ మంత్రులతో కొద్ది రోజుల క్రితం ఆయన సమాలోచలు చేశారు. అనంతరం '99 రోజుల ప్రణాళిక' రూపుదిద్దుకుందని సమాచారం. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎం ఆదేశించారు. పనిలో పనిగా ఆయా ప్రాంతాల్లో పార్టీ బలబలాలు, వెనుకబడటానికి గల కారణాలను అన్వేషించాలని ఆయన సూచించారు. అనంతరం 99 రోజుల్లో 'దిద్దుబాటు' కార్యక్రమాలను చేపట్టేందుకు వీలుగా వ్యూహం రచించనున్నారని తెలిసింది.


## వెలుగుమట్ల పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు

మొదటి తరువాయి

ఉంటున్నారని మంత్రి తెలిపారు. వీళ్లలో కొందరు ఓ ముఠాకి రూ.30 వేల నుంచి రూ.8 లక్షల వరకు డబ్బు చెల్లించి షెడ్లు నిర్మించుకున్నారని చెప్పారు. ఆ ముఠాను అరెస్టు చేస్తామని అంతేకాక ముఠా వసూలు చేసిన డబ్బును రికవరీ చేసి బాధితులకు చెల్లిస్తామని మంత్రి స్పష్టం చేశారు. వెలుగుమట్ల బాధితులతో ఖమ్మం కలెక్టరేట్‌లో ఆదివారం సమావేశమైన మంత్రి పొంగులేటి ఈ మేరకు మాట్లాడారు. బాధితులందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి పొంగులేటి విలేకరులతో మాట్లాడుతూ.. భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన 720 కుటుంబాలను గుర్తించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, వెలుగుమట్లలో నష్టపోయిన స్థానిక పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ముగ్గుపోసి నిర్మిస్తామన్నారు. 15 రోజుల్లో ఈ కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. వీరందరికీ విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలతోపాటు, అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ స్కూలు ఏర్పాటు చేస్తామని వారు గౌరవంగా జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా జిల్లాకు చెందిన మంత్రులతోపాటు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు న్యాయం చేయలేదని, ఇళ్లు కూల్చి నష్టం చేసిందన్నారు.

## సమాచార లోపంతోనే గందరగోళం

మొదటి తరువాయి



బాబు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తోందని అన్నారు. తమ ప్రభుత్వానికి భేషజాలు లేవని, తప్పులు దొర్లితే ఎప్పటికప్పుడు సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శారదా పీఠం భూముల విషయంలో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకొని కొందరు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వారి రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమది బుల్డోజర్ సంస్కృతి కాదని, కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడటం చూసి ఓర్వలేకే కొందరూ రాష్ట్ర ప్రభుత్వంపై కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు. బాపుఘాట్ అభివృద్ధి విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకెళ్తామని, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని స్థానికులకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.

## ఇండ్లను ధ్వంసం చేయొద్దు

మొదటి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. 20 ఏండ్ల క్రితం నిర్మించుకున్న ఇండ్లను కూల్చి వేయడం తగదన్నారు. ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు ప్రభుత్వమే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వానికి ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు చెల్లిస్తు న్నారని తెలిపారు. నిర్మించుకున్న ఇండ్లపైన ఈఐఎంలు, అప్పులు ఉన్నాయ న్నారు. అభివృద్ధి చేయాలే గానీ విధ్వంసం చేయొద్దని తెలిపారు. సుందరీకరణ పేరుతో వేలకోట్ల రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రూ.16వేల కోట్లతో సుందరీకరణ చేయొచ్చని డీపీఆర్ ప్రజెంటేషన్ చేశామ న్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగ్గర ఇలాంటి డీపీఆర్ లేదా అని ప్రశ్నించారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, శాసనమండలి మాజీ చైర్మెన్ స్వామిగౌడ్, బీఆర్‌ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, బండ్లగూడ, నార్సింగి అధ్యక్షులు నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌గౌడ్, మందా రవీందర్‌రెడ్డి, ముక్తార్ పాషా, విష్ణువర్ధన్, మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా ఇండ్లను కూల్చొద్దని సీఎంకు చెప్పండి : చిన్నారి

మూసీ సుందరీకరణ పేరుతో మా ఇండ్లను కూల్చొద్దని, సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పాలని, కావాలంటే నా కిడ్డీ బ్యాంకు, బొమ్మ తీసుకోవాలని ఓ చిన్నారి ఏడ్చుకుంటూ ఇండ్ల బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన కేటీఆర్‌ను కోరాడు.

# విజయవంతంగా సేంద్రియ వ్యవసాయ అవగాహన సదస్సు



**పెద్దపల్లి, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రసాయనాల వినియోగం వలన భూమి సారాన్ని కోల్పోయి భవిష్యత్తులో పంటల పెంపకానికి ఉపయోగకరంగా ఉండకపోవచ్చని మాజీ సైనికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాఘవపూరులోని రెడ్డి ఫంక్షన్ హాల్లో ఆదివారం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు విజయవంతంగా జరిగింది. శ్రీవెంకటేశ్వర కోఆపరేటివ్ సోసైటీ పవర్ అండ్ ఆగ్రో ప్రాసెసింగ్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ శివాజీలాల్ డోలే, డైరెక్టర్ ఎల్లప్ప, పున్నప్ప మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడితో లాభాలను రైతులు పొందవచ్చని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక రైతులు ఇప్పటికే సేంద్రియ విధానాలతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. కల్తీలేని పోషకాలతో కూడిన పంటలను పండించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విజయ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో మాజీ సైనికులు, రైతులు ఒకే వేదికపైకి వచ్చి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ తమ సంస్థలో సభ్యత్వం పొందాలని, రైతుల పిల్లలకు వ్యవసాయ రంగంలో మెలుకువలు నేర్పించి సేంద్రియ విధానంపై పట్టు సాధించేలా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీలు మంథని రమేష్, వెలిశెట్టి సంతోష్ కుమార్, అప్పన్నపేట సర్పంచ్ ఆరె సంతు, దేవునిపల్లి సర్పంచ్ బొక్కల సంతు, పలు గ్రామాల సర్పంచులు, రైతులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం




**అచ్చంపేట, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎం.ఈ.ఎఫ్.ఎం.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఎడెల్లి ఆంజనేయులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మూడు దశాబ్దాల ఉద్యమంలో మాదిగ అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేసి జాతి లక్ష్య సాధనకు మార్గం చూపారని నివాళులు అర్పించారు. త్యాగాలు లేకుండా ఏ పోరాటం గమ్యాన్ని ముద్దాడదు, పోరాటాలు లేకుండా విజయం దరి చేరదు అని ఆయన పేర్కొన్నారు. నాడు అమరుల ఆశయాలను సాకారం చేస్తామని ప్రమాణం చేసిన ఉద్యమం, నేడు ఎస్సీ వర్గీకరణ సాధనతో ఆ ఆశయాలను నెరవేర్చిందని తెలిపారు. మాదిగ సమాజం పొందుతున్న ఫలితాలు అమరుల త్యాగాలకు సాక్ష్యమని, వారి జ్ఞాపకాలను ప్రపంచానికి చాటి చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొయ్యాల వెంకటేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఖాసీం మాదిగ, ఎమ్మెసేఫ్ రాష్ట్ర నాయకులు మహేష్ మాదిగ, బీఎస్పీ ఇంచార్జి కృపానంద్, మున్సిపల్ కౌన్సిలర్ అంతటి శివ, బీజేపీ నాయకులు శంకర్ మాదిగ, బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు మోతె రాజు, సీనియర్ నాయకులు బుద్దుల మల్లయ్య, విజయ్, వెంకయ్య, కొండలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహం



**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహకాన్ని అందజేస్తానని గత పంచాయతీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆ మాటను నిలబెట్టుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గన్నేరువరం మండలంలోని పీచుపల్లి, కోహెడ మండలంలోని విజయనగర్ కాలనీ గ్రామ పంచాయతీలకు ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.10 లక్షల చొప్పున విడుదల చేశారు. ఈరోజు ఆయా గ్రామాలకు విచ్చేసిన బండి సంజయ్, గ్రామస్థుల సమక్షంలో సర్పంచులకు నిధుల సర్క్యులర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తెచ్చి పనులు చేస్తానని, విమర్శలను పట్టించుకోనని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రజల కోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని పునరుద్ఘాటించారు. అనంతరం పీచుపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సామ రాజిరెడ్డి, స్థానిక బీజేపీ నేతలకు ఎంపీ లాడ్స్ నుండి రూ.10 లక్షల ప్రోత్సాహక నిధుల సర్క్యులర్ కాపీని అందజేశారు. మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవంగా ఎన్నికైన 1203 గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.120 కోట్ల 30 లక్షలు ఇవ్వాలని ప్రకటించినా, ఇప్పటివరకు పైసా ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కూడా గతంలో ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, హామీలిచ్చి మోసం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను మించిపోయారని బండి సంజయ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని, ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలని పిలుపునిచ్చారు.

## యూరియా యాప్లో ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని రైతుల ఆందోళన




**అచ్చంపేట, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం వచ్చిన రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉదయం 10 గంటలకు 300 యూరియా బస్తాలను ఫర్టిలైజర్ యాప్‌లో అందుబాటులో ఉంచగా, కొన్ని నిమిషాల్లోనే స్టాక్ నిల్ అని చూపించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం వద్ద వేచి ఉన్న దాదాపు 20 మంది రైతుల్లో కేవలం ఒకరిద్దరికి మాత్రమే 2c4 బస్తాలు బుక్ అయ్యాయి. మిగిలిన వారికి ఒక్క బస్తా కూడా అందకపోవడంతో వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ, ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, అసలైన సాగుదారులకు ఎరువులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పాస్‌బుక్ ఆధారంగా కాకుండా ఏఈవోలు నిర్వహించిన పంట సాగు సర్వే ఆధారంగానే యూరియా కేటాయించాలని, యాప్‌లో ఉన్న లోపాలను సరిదిద్దాలని, సాగు చేస్తున్న అర్హులైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా నిబంధనలు తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యాకమిషన్ సిఫారసులపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం



**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర విద్యా కమిషన్ చేసిన సిఫారసులు అసంబద్ధమని, ఆక్షేపనీయమని ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైజింగ్ 2047, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు విద్యారంగంలో సంస్కరణలు అవసరమని ప్రభుత్వం భావించి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. అయితే కమిషన్ చేసిన సిఫారసులు విద్యారంగ లక్ష్యాలను అపహాస్యం చేసే విధంగా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు విమర్శించాయి. ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించాలని అనేక మంది విద్యావేత్తలు సూచిస్తుంటే, విద్య మొత్తం ఇంగ్లీష్ మీడియంలోనే జరగాలని చెప్పడం, గ్రామీణ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం 35 నుండి 45 శాతానికి పెంచాలని ప్రతిపాదించడం, ఉపాధ్యాయుల వేతనాలపై ప్రతికూల వ్యాఖ్యలు చేయడం, పాఠశాలల్లో నాయకుల ఫోటోలు, విగ్రహాలు ఉండకూడదని చెప్పడం వంటి అంశాలు దేశభక్తి, నైతిక విలువలను దెబ్బతీసేలా ఉన్నాయని వారు పేర్కొన్నారు. అదేవిధంగా, వచ్చే ఐదు సంవత్సరాలు ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకూడదని, కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు జరగాలని సూచించడం యువత, నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఈ సిఫారసులు ప్రభుత్వ పెద్దల రాజకీయ ఎత్తుగడలో భాగమని, ఉపాధ్యాయుల సమస్యలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నమని వారు ఆరోపించారు. కరీంనగర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఉమ్మడి సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరైన నిర్ణయాలు తీసుకోవాలని, జాతీయ విద్యా విధానం 2020ని లోతుగా అధ్యయనం చేసి ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథం ఏర్పరచాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో ప్రభుత్వం గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చందూరి రాజిరెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, కట్ట వేణుగోపాల్, ఎస్టీయూ జిల్లా నేతలు పిన్నింటి తిరుపతిరావు, కోట శ్యాంకుమార్, దాసరి శ్రీధర్, ఎస్జీటీయూ జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, టిటీయూ జిల్లా అధ్యక్షుడు గంప చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయరమణారావు ఓదెల మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**పెద్దపల్లి, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం కుటుంబ సమేతంగా ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం బోనాలు సమర్పించి, పట్నాలు వేసి స్వామివారిని కుటుంబంతో కలిసి కొలిచారు. ఆలయ కమిటీ తరఫున మెమెంటోలు, స్వామివారి కండువాలతో ఎమ్మెల్యే విజయరమణారావు మరియు కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓదెల మల్లన్న ఆశీస్సులతో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య, కమిటీ డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, అర్చకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మారుతి నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా యాంసాని అశోక్ ఎన్నిక

**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్‌లోని మారుతి నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం బైలా ప్రకారం సభ్యులందరూ ఏకగ్రీవంగా రెండవసారి యాంసాని అశోక్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, వైశ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అశోక్ గత పదవీకాలంలో సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం కృషి చేసిన విధానం ప్రశంసనీయమని, ఆయన నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. సంఘం కార్యకలాపాలను విస్తరించి, సామాజిక సేవా కార్యక్రమాలను మరింతగా



చేపట్టేందుకు కొత్త కార్యవర్గం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని నాయకులు తెలిపారు. వైశ్య సమాజ ఐక్యత, యువతకు మార్గదర్శకత్వం, విద్యా సహాయం, సామాజిక సేవా కార్యక్రమాల్లో అశోక్ నాయకత్వం కీలకమని వారు పేర్కొన్నారు

# నిరుద్యోగ యువతకు అండగా ఆర్‌ఈఎస్‌ఈటి శిక్షణ కేంద్రం ప్రారంభం




**పెద్దపల్లి, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిరుద్యోగ యువతకు తక్కువ ఫీజుతో నాణ్యమైన శిక్షణ అందించేందుకు పెద్దపల్లి జిల్లాకేంద్రంలో రాజయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ఎగ్జామినేషన్ ట్రైనింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ నూగిల్ల మల్లయ్య, బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉషతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కోసం చదువుతున్న అభ్యర్థులకు మంచి శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు తోడైతే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని అన్నారు. ఫిట్ అండ్ ఫ్యూచర్ ద్వారా ఎన్జీఓలు, కార్పొరేట్ సంస్థలు, స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్లను ఏకంచేసి విద్యార్థులను ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించేలా మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు.డైరెక్టర్ వొల్లె ప్రీతిఉదయ్ మాట్లాడుతూ, తమ సంస్థలో అడ్మిషన్లు ప్రారంభించామని, దాతలు ముందుకు వస్తే ఉచిత శిక్షణ ఇవ్వడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజయ్యను సన్మానించారు. కౌన్సిలర్లు మొలుగూరి కమల్, ఫణీంద్రభూపతి, అనూష, సుల్తానాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ చిరంజీవి, ఆర్‌ఎఫ్సీఎల్ హెచ్‌ఆర్ సోమనాథ్, పెటా అధ్యక్షుడు సురేందర్, ఫిట్ అండ్ ఫ్యూచర్ అధ్యక్షుడు మచ్చా రాహుల్, ఉపాధ్యక్షుడు కల్వల చరణ్, రక్షణ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సుజిత, ది లైబ్రరీ కంపెనీ అధినేత శరత్ చంద్ర, డేటా సైన్స్ పూర్వవిద్యార్థి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో మోసం తల్లి, కొడుకులు అరెస్ట్



**కరీంనగర్ రూరల్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ సమీపంలోని చల్మెడ హాస్పిటల్‌లో పనిచేస్తున్న యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం చేసిన రాకేష్ అనే యువకుడిని, అతని తల్లి పద్మను పోలీసులు అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన బాధితురాలు గత కొంతకాలంగా హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తోంది. అదే హాస్పిటల్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాకేష్ పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని నమ్మించాడు. సెప్టెంబర్‌లో తన ఇంటికి తీసుకెళ్లి శారీరకంగా వాడుకున్నాడు. పెళ్లి చేస్తానని నమ్మబలికిన రాకేష్ పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు.ఈ విషయం గురించి బాధితురాలు రాకేష్ తల్లి పద్మకు చెప్పగా, కొడుకు చర్యలకు మద్దతు తెలిపింది. నవంబర్‌లో గర్భం దాల్చిన బాధితురాలు పెళ్లి చేసుకోవాలని అడగగా, రాకేష్ ట్యాబ్లెట్లు తీసుకువచ్చి వాటిని వాడకపోతే చంపేస్తానని బెదిరించాడు. ట్యాబ్లెట్లు వేసుకుంటేనే పెళ్లి చేస్తానని నమ్మబలికాడు.తనను కులం పేరుతో దూషిస్తూ పెళ్లి చేయబోమని పద్మ దుర్భాషలాడడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసి, అట్రాసిటీతో పాటు అత్యాచారం కేసులో విచారణ జరిపారు. రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ, బొమ్మకల్ గ్రామానికి చెందిన రాకేష్, పద్మలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

# ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సమక్షంలో విహారయాత్ర




**కరీంనగర్, మార్చి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం ఆధ్వర్యంలో ఆదివారం విహారయాత్ర నిర్వహించారు.వైశ్యభవన్ నుండి బస్సులో బయలుదేరిన సభ్యులు మొదట కమాన్‌పూర్‌లోని శ్రీ ఆది వరాహ స్వామి ఆలయాన్ని, అనంతరం సుద్దుల్లలోని శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి ఆలయాన్ని, చివరగా మందమర్రిలోని కామాఖ్య ఆలయాన్ని దర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపి తిరిగి కరీంనగర్ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అవోపా ఉపాధ్యక్షులు సామ నారాయణ, పీవీ రామకృష్ణ, కట్కూరి సుధాకర్, కొత్త ప్రకాశ్, వి. రవీందర్, కొండూరి అజయ్ చక్రవర్తి, ఎల్. చంద్రశేఖర్, పబ్బ అరుణ, శ్రీదేవి, ప్రోగ్రాం ఇంచార్జి నాగమల్ల మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్ ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన భూమిపూజ



**మలక్‌పేట్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సైదాబాద్ ఎస్సీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం భూమిపూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాలకు దైవస్వరూపుడైన అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. విగ్రహ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలి” అని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బండా జగన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ వేడుకలో సైదాబాద్ కార్పొరేటర్ అరుణ రెడ్డి, ఉజ్వల ఫౌండేషన్ చైర్మన్ బండా జగన్, కమిటీ సభ్యులు కిషోర్, కిరణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చెలుపూరి విష్ణుమాచారి



**హుస్నాబాద్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా చెలుపూరి విష్ణమాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉప సర్పంచ్ అనిల్, లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, సీనియర్ జర్నలిస్టు రెడ్డి సంఘం అధ్యక్షుడు గాదె రఘునాథ్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కాంతల శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు నడిగొట్టు కిరణ్, అనిల్, సురేశ్, ఎలయ్య తదితరులు విష్ణమాచారిని శాలువా కప్పి సన్మానించారు.ట్రాక్టర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పోతారవేణి కుమార్, ఉపాధ్యక్షులుగా అందె సారయ్య, సలహాదారులుగా కాంతల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లుగా కూన రాజు, బురికి సంతోష్, అప్పల సంపత్, చింతపూల కిరణ్, ముక్కెర అనిల్, పోతారవేణి శ్రీనివాస్, కూన రామస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యజమానులు మంద శ్రీనివాస్, పోచయ్య, అందె తిరుపతి రాజు, శ్రీశైలం, అనిల్, అజయ్, మురళి, శ్రీకాంత్, విష్ణు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వరాల మల్లన్న స్వామి జాతర



**హుస్నాబాద్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం పరివేద గ్రామంలో ఆదివారం వరాల మల్లికార్జున స్వామి జాతరను శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు వైభవంగా నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయం వద్ద ఒగ్గు పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరివేదతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి వరాల మల్లికార్జున స్వామి, శ్రీరేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. మహిళలు బోనం వండుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించి అగ్గి గుండాలు దాటి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయం వద్ద ఒగ్గు కళాకారులు వేసిన మల్లన్న పట్నాలు, ఒగ్గు కథ భక్తులను ఆకట్టుకొని ఆలోచింపజేశాయి. నిర్వాహకులు మాట్లాడుతూ, స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరారు. ప్రతి ఏటా నిర్వహించే జాతరలో త్రాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.జాతరకు హాజరైన భక్తులకు మహా అన్నప్రసాదం ఏర్పాటు చేసి, చలువ పందిళ్లు, విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలు కల్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ముక్కెర లింగయ్య, ముక్కెర బాలమల్లయ్య, సిద్దుల శ్రీనివాస్, ముక్కెర రాజు, సిద్దుల సుదర్శన్ యాదవ్, ముక్కెర బొందయ్య, తోడేటి అనీల్, చిలుపూరి మల్లయ్య, చిలుపూరి కొమరయ్య, చిలుపూరి సంజీవ్, కాటం ఐలయ్య, సిద్దుల సంపత్, చిలుకూరి శ్రీకాంత్ యాదవ్, ముక్కెర కొమురెల్లి, పోతరవేణి శ్రీనివాస్, జల్లిక మల్లయ్య, ఏడబోయిన అజేయ్, విజేయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు

## ప్రజా గాయకుడు రేంజర్ల రాజేష్



**ఆమనగల్లు, మార్చి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :**
ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ప్రజా గాయకుడు, సామాజిక కార్యకర్త రెంజర్ల రాజేష్ అన్నారు. ఇటీవలే ఆమనగల్లు మున్సిపాలిటీ ఎనిమిదవ వ వార్డు కౌన్సిలర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన ఏనుమల్ల రమేష్ ను ఆదివారం ఆయన నివాసంలో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉండి నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఎనిమిదవ వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలన్నారు. ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట గోరటి రమేష్, సింగల్ విండో మాజీ డైరెక్టర్ జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
16వ డివిజన్ మల్కాపూర్ రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా నరహరి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గునుకుల దేవేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కార్పొరేటర్ కాంతల జగన్ రెడ్డి, గౌరవ సలహాదారుడిగా మాజీ సర్పంచ్ కాంతల ఇంద్రసేనారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యక్షులుగా గునుకుల దేవేందర్ రెడ్డి, కాంతల కిషన్ రెడ్డి, కోశాధికారిగా కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులుగా కాంతల రమేష్ రెడ్డి, కాంతల శ్రీకాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కాసర్ల జితేందర్ రెడ్డి, కాంతల కిషన్ రెడ్డి, నరహరి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. 2026c28 రెండేళ్ల కాలానికి ఈ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ప్రకటించారు.

# భీమనపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవం

**మిర్యాలగూడ, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భీమనపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ మహోత్సవంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంబేద్కర్ గారి ఆశయాల స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేస్తోంది. ఒక శాసనసభ్యుడిగా నేను కూడా అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ అంబేద్కర్ ఆశయ సాధనలో పనిచేస్తాను” అని అన్నారు.కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ సమక్షంలో ఉచిత వైద్య శిబిరం





**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హనుమాన్ నగర్ బైపాస్ రోడ్డులోని వినాయక టవర్స్ ఎదురుగా శాంతి ఫార్మసీ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ సహకారంతో ఆదివారం ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 150 మందికి పరీక్షలు చేయగా, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు 40 మందికి మోకాళ్ల నొప్పి పట్టీలు అందజేశారు. కార్యక్రమంలో లయన్ పాత కిరణ్ కుమార్ అధ్యక్షుడిగా, లయన్ రోండ్ల ప్రభాకర్ రెడ్డి కార్యదర్శిగా, లయన్ చొళ్ళేటి శివకుమార్, లయన్ గజెల్లీ అశోక్, దాత బండ పవన్ రెడ్డి (శాంతి ఫార్మసీ), ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ అక్షయ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సమక్షంలో ఉచిత అల్పాహార వితరణ



**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్ డిస్ట్రిక్ట్ 320జి మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం భాగంగా 973వ రోజు ఉచిత అల్పాహార వితరణ నిర్వహించారు. లయన్ ననువాల గిరిధర్ రావు, లయన్ లేడీ హరిప్రియ పెళ్లి రోజు సందర్భంగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో 200 మందికి పైగా అవసరార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ ననువాల గిరిధర్ రావు అధ్యక్షుడిగా, లయన్ పాశం నర్సింహా రెడ్డి కార్యదర్శిగా, లయన్ మానువాడ శంకర్ (ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్), లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్ (పాస్ట్ ప్రెసిడెంట్), లయన్ చిలుపూరి రాములు (ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్), లయన్ బండారి గంగాధర్ (థర్డ్ వైస్ ప్రెసిడెంట్), లేడీ లయన్ ననువాల హరిప్రియ, లయన్ బద్దం మల్లారెడ్డి (జెడ్‌సి), లయన్ రంగు రాజు (గోల్డెన్ టవర్ అధ్యక్షుడు) పాల్గొన్నారు. లయన్స్ రవి కంటి కృష్ణ కిషోర్,మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ హంగర్ రిలీఫ్ కార్యక్రమం వివరాలు తెలియజేశారు.

# యూరియా కొరతతో రంగారెడ్డి జిల్లా రైతుల ఆవేదన




**ఆమనగల్లు, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫర్టిలైజర్ యాప్‌లో ఏ ఒక్క షాపులోనూ స్టాక్ చూపించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటలకు యూరియా వేయాల్సిన సమయంలో నిల్వలు లేకపోవడం వల్ల దిగుబడి తగ్గిపోతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి యూరియా సరఫరాను క్రమబద్ధీకరించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో నూతన నేత్ర వైద్యశాల ప్రారంభం



**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాజా థియేటర్ లైన్, సాయినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డా. ఇషిక నేత్ర వైద్యశాలను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా హాజరై ప్రారంభించారు.

# తపస్ జిల్లా శాఖ సమక్షంలో మంత్రి బండి సంజయ్కు ఘన సన్మానం



**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ చారిత్రక విజయాన్ని సాధించిన సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు తపస్ కరీంనగర్ జిల్లా శాఖ ఘన సన్మానం చేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ముందుండి నడిపించి అత్యధిక కార్పొరేటర్ స్థానాలను గెలిపించడంతోపాటు, తెలంగాణ చరిత్రలో తొలిసారిగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కైవసం చేసుకోవడం ఈ విజయానికి ప్రత్యేకతను తెచ్చింది. ఈ సందర్భంగా తపస్ జిల్లా శాఖ 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన డైరీని అందజేసి బండి సంజయ్‌ను సన్మానించింది. మంత్రి మాట్లాడుతూ, ఈ విజయ సాధనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యుల మద్దతు ఎనలేనిదని, రాబోయే కాలంలో వారి సమస్యల పరిష్కారంలో తాను ముందుంటానని తెలిపారు. కరీంనగర్ నగర పరిధి విస్తరించినందున త్వరలోనే చుట్టుపక్కల 23 గ్రామాలకు 17% నూతన హెచ్‌ఆర్‌ఏ రాబోతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 5 డీఏలను ప్రకటించాలని, పీఆర్‌సీ అమలు చేసి నూతన వేతనాలను అందించాలని, పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక గ్రీన్ ఛానల్ ద్వారా వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అన్నమనేని తిరుపతిరావు, జాతి నరసయ్యల ఆధ్వర్యంలో తపస్ బృందం, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు అంబటి వేణు కుమార్, ఓరుగంటి కరుణాకర్ రావు, కట్కూరి శ్రీధర్ రెడ్డి, రాచకొండ పవన్ కుమార్, పోలాడి సత్యనారాయణ రావు, కొడిమ్యాల ఐలయ్య, బోయిని శ్రీకాంత్, బొనగంటి లచ్చయ్య, చేర్యాల వెంకటేశ్వర్లు, ఓదెల శివకుమార్, జి. కృష్ణమూర్తి, ఆర్. చంద్రశేఖర్, టి. సంపత్, ఆర్. రాజిరెడ్డి, జి. కుమారస్వామి, బైరి సురేష్, ఆకుల చంద్రశేఖర్, బి. సత్యనారాయణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో ఘనంగా 34 వ వార్షికోత్సవ వేడుకలు






**ఆమనగల్లు, మార్చి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
స్థానిక ఆమనగల్లు పట్టణంలోని వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో శనివారం రోజు సాయంత్రం పాఠశాల స్థాపించి 34 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాఠశాల ఆవరణలో వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీ కాటం స్వరూప హాజరయ్యారు. వీరితోపాటు సీనియర్ ఉమెన్స్ ఎన్సీసీ ఇన్స్ట్రక్టర్ సరోజ బాల ఠాగూర్ , డాక్టర్ బి పుల్లయ్య హాజరయ్యారు. మెజిస్ట్రేట్ కాటమ్ స్వరూప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వివేక విద్యా భారతి విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. గతంలో ఇదే పాఠశాలలో చదివి వివిధ ఉన్నత స్థాయిలలో రాణిస్తున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. సాధారణ బడ్జెట్ పాఠశాల స్థాయిలో ఉండి కూడా కార్పొరేట్ పాఠశాలలను మించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. మండల స్థాయి, జిల్లాస్థాయి మరియు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కోట మైసమ్మ దేవస్థానంలో వైభవంగా ముగ్గు కార్యక్రమం




**మాడుగుల, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోట మైసమ్మ దేవస్థానంలో ముగ్గు కార్యక్రమం ఈ రోజు ఘనంగా నిర్వహించబడింది. దేవాలయ ప్రాంగణం గ్రామ పెద్దలు, ప్రజలతో కళకళలాడింది. అవురుపల్లి గ్రామ సర్పంచ్ కిన్నెర పెద్ద పోచయ్య, ఉప సర్పంచ్ బన్నే చెన్నయ్య, గ్రామ పెద్దలు వట్టేపు వెంకటేశ్వరరావు, గౌని లాలయ్య గౌడ్, గౌని నిరంజన్ గౌడ్, కురేలా దామోదర్, నాప బీరయ్య పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు గుడ్ల వెంకయ్య, బోడిగాల యాదయ్య, మేస్త్రి బన్నే మల్లేష్, దార్ల అమరేష్, కిన్నెర మహేందర్, దార్ల నాగార్జున, నారోజు చంద్రమౌళి, సూగురు మహేందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని దేవస్థానాన్ని కళకళలాడేలా చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, „మైసమ్మ దేవస్థానం గ్రామ ఐక్యతకు ప్రతీక. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల ఆధ్యాత్మికతను పెంపొందించడమే కాక, గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తాయి” అని పేర్కొన్నారు.

# ఆచారిని విమర్శించే స్థాయి ఉప్పలకు లేదు

**బిజెపి దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నింగ్యారి యాదగిరి**



**కడ్తాల్, మార్చి 1 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :**
బిజెపి జాతీయ మాజీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి నీ విమర్శించడం తగదని బిజెపి దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి అన్నారు. ఆదివారం కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో అయన మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గం లో బిజెపి ఆచారి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టారని అన్నారు. తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ పదేపదే సోషల్ మీడియా వేదికగా బిజెపి ఆచారిని విమర్శించడం తగదని ఆయన మండిపడ్డారు. కల్వకుర్తి డివిజన్ కోసం అనేక పోరాటాలు చేసిన ఆచారి అదేవిధంగా కే ఎల్ ఐ భూ బాధితులకు పరిహారం ఇప్పించడంలో ఆచారి కృషి చేశారని, అదేవిధంగా కడ్తాల్, అమనగల్, వెల్దండ మండల కేంద్రాలలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు ఆచారితో సాధ్యమైంది అన్నారు ఆమనగలు పట్టణ అభివృద్ధి కోసం ఆచారి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఒకే పార్టీని నమ్ముకొని ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఆచారిని ఉప్పల వెంకటేష్ విమర్శించే స్థాయి కాదన్నారు. పూటకోక పార్టీ మారే ఉప్పల.. ఆచారి గురించి మాట్లాడితే నియోజకవర్గ ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని యాదగిరి అన్నారు.

# వైభవంగా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం



**పెద్ద అంబర్‌పేట, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్ద అంబర్‌పేట ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. వాసవి కన్యాకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో ఆర్యవైశ్య బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంఘ అభివృద్ధి, సేవా దృక్పథం, సామాజిక బాధ్యతలను బలోపేతం చేయాలనే సంకల్పంతో జనరల్ కమిటీ, మహిళా కమిటీగా రెండు కమిటీలను ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు సమాజ సేవకు అంకితభావంతో పని చేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవాధ్యక్షుడు మాధవ్ శెట్టి వెంకయ్య గుప్తా ఆధ్వర్యంలో కార్యక్రమం సజావుగా జరిగింది. అధ్యక్షుడిగా నారాయణ రాజేశ్వరి గుప్తా, ప్రధాన కార్యదర్శిగా మాదంశెట్టి నరేంద్ర గుప్తా, కోశాధికారిగా పారేపల్లి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. మహిళా కమిటీ తరఫున అధ్యక్షురాలిగా సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా సంధ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు అమరవాది లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు సదానందం, గుడిపాటి శ్రీనివాస్ గుప్తా, మీలా విజయ్‌కుమార్, మాధవ్ శెట్టి రాణి తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, “ఆర్యవైశ్యుల ఐక్యతే సంఘ బలం. సమాజంలోని బీద ప్రజలకు సేవ చేయడం ప్రతి ఒక్కరి ధర్మం. యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వాములను చేయాలి. దేవాలయ కార్యక్రమాలలో అధికంగా పాల్గొని ఆధ్యాత్మికతను పెంపొందించాలి” అని పిలుపునిచ్చారు. చివరగా సభికులంతా చప్పట్లతో నూతన కార్యవర్గానికి ఆమోదం తెలుపుతూ ఆశీర్వాదాలు అందించారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. ఈ నూతన కార్యవర్గం నాయకత్వంలో పెద్ద అంబర్‌పేట ఆర్యవైశ్య సంఘం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని సభికులు ఆకాంక్షించారు.

# బిఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడితే తగిన మూల్యం తప్పదు

- కొయ్యల పుల్లయ్య



మాజీ డిసిసిబి అధ్యక్షుడు మామిళ్లపల్లి విష్ణువర్ధన్

**వెల్దండ, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య మాట్లాడుతూ, “రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ నేతలను దుర్భాషలాడడం బిఆర్ఎస్ నాయకుల అవివేకానికి నిదర్శనం” అని ఘాటుగా విమర్శించారు. ఇటీవల కుమ్మెర గ్రామంలో జరిగిన ఘటనలో రజక కులానికి చెందిన రెండు నెలల పాప మృతి చెందగా, కాంగ్రెస్ పార్టీ నేతలు గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిజ నిర్ధారణ కమిటీని నియమించిందని, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెద్దుల్లో కొత్వాల్, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ డిసిసిబి అధ్యక్షుడు మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు గ్రామానికి వచ్చి వాస్తవాలను తెలుసుకున్నారని వివరించారు. అయితే ప్రతిపక్షాలు వాస్తవాలను పక్కనబెట్టి కాంగ్రెస్ నేతలపై ఇష్టం వచ్చిన రీతిలో విమర్శలు చేయడం అలవాటైందని ఆయన మండిపడ్డారు. “ఎంపీ మల్లురవిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం విడ్డూరం. ఇది వారి స్థాయి, భాష మరిచిపోయిన అవివేకానికి నిదర్శనం. మునిసిపల్ ఎన్నికల్లో, గ్రామపంచాయతీ ఎన్నికల్లో, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో వరుసగా ఓటమి పాలై మతిభ్రమించి మాట్లాడుతున్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం కూడా మతిభ్రమించిందని, కల్వకుర్తిలో ఇన్‌చార్జ్ ఎవరో తేల్చుకోలేక గందరగోళానికి గురవుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఉప్పల వెంకటేష్, గోలిశ్రీనివాస్ రెడ్డి, జూపల్లి భాస్కరరావు కూడా మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. “నాగర్‌కర్నూల్ ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్ర డీజీపీని కలసి, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్షించాలనే విజ్ఞప్తి చేశాం. బిఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడితే తగిన మూల్యం తప్పదు” అని కొయ్యల పుల్లయ్య స్పష్టం చేశారు.

# సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బి. అజయ్ సారథి రెడ్డి



**మహబూబాబాద్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ మున్సిపాలిటీ 33వ వార్డు నుండి గెలిచిన బి. అజయ్ సారథి రెడ్డి మూడవసారి సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. 2014, 2020లో కూడా ఫ్లోర్ లీడర్‌గా పనిచేసి అనేక సమస్యలను పరిష్కరించిన అజయ్ సారథి రెడ్డి, మానుకోట పట్టణంలో మూడు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలు, భూ పోరాటాలు, కార్మిక హక్కుల కోసం పోరాడారు. తెలంగాణ ఉద్యమంలో బిజిలి బంద్, రైల్ రోకో, చలో హైదరాబాద్ వంటి మహత్తర పోరాటాలకు నాయకత్వం వహించారు. క్రీడలు, సాహిత్యం, కళారంగాల్లోనూ తనదైన ముద్ర వేసిన ఆయన, మానుకోట జిల్లా ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే అజయ్ సారథి రెడ్డిని స్థానికులు “మానుకోట ప్రజాయుద్ధనౌక”గా పిలుస్తున్నారు.

# ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ కార్యక్రమం



**కరీంనగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విశేష సేవలందించిన నలుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. అడిషనల్ డీసీపీ ఏఆర్ భీంరావు, ట్రాఫిక్ పీఎస్ ఎస్సై ఇషాక్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై విజేందర్ రావు, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై మోయిద్ అలీ పదవీ విరమణ పొందారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ సీపీ గౌష్ ఆలం, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం అనేక సవాళ్లతో కూడుకున్నదని, దాన్ని విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందడం గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని గుర్తుచేశారు. సీపీ స్వయంగా అధికారులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో నిండాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వు ఇన్స్పెక్టర్ అడ్మిన్ రజినీకాంత్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అవురుపల్లి దేవాలయంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



**మాడుగుల, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ శ్రీ శ్రీ సీతారామచంద్ర హనుమాన్ సమేత ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 11 గంటలకు గ్రామస్థుల సమక్షంలో సమావేశం జరిగింది. గ్రామ సర్పంచ్ శ్రీ కిన్నెర పోచయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధి, నిత్యపూజా కార్యక్రమాల నిర్వహణ కోసం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వట్టే మురళీధరరావు అధ్యక్షుడిగా, బాలమోని కృష్ణయ్య, గౌని నిరంజన్ గౌడ్ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులుగా కేశమోని శ్రీనివాసులు, కనుగుల లక్ష్మయ్య, అలవాలా కృష్ణయ్య, బన్నే రాములు, ఎం. శ్రీకాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఏంగలి రామయ్య బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా మేడం రామచంద్రయ్య, నరోజు కొండలచారి, బాలమోని కాటంరాజు, బాలమోని యాదయ్య, డోనదుల జంగయ్య, కల్యానుకర్ శ్రీనివాసులు, నాగిళ్ళ రాజు, వట్టెమ్ రాజు, మారం శివ ప్రసాద్, చింతపల్లి అంజయ్య, కలకొండ వీరయ్య, కలకొండ మన్యం, వంగల్లా రామ్మోహన్, ఏంగలి ప్రేమలత, ఇటీకాల సుగుణమ్మ, గుడ్ల మహేందర్, బొడిగాల మల్లేష్, పోలె లక్ష్మయ్య (మేస్త్రి), మేడ బిక్షపతి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, “ఈ నూతన కార్యవర్గం ఆలయ అభివృద్ధి, నిత్యపూజా కార్యక్రమాలను మరింత శ్రద్ధతో నిర్వహించి గ్రామ ప్రజల ఆధ్యాత్మికతను పెంపొందించాలి” అని ఆకాంక్షించారు. సభికులంతా చప్పట్లతో నూతన కార్యవర్గానికి ఆమోదం తెలుపుతూ ఆశీర్వాదాలు అందించారు.


# మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కావు

-పరుశరాముడు



**పెద్దకొత్తపల్లి, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద అమరవీరుల దినోత్సవం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు పరుశరాముడు మాదిగ మాట్లాడుతూ, “మాదిగ అమరవీరుల త్యాగాలను జాతి ఎన్నటికీ మరవదు. ఎస్సీ వర్గీకరణ అమలు ద్వారా వారి ఆశయాలు నెరవేరాయి” అని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో సాగిన ఉద్యమ ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందని గుర్తుచేశారు. అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయల ఆర్థిక సహాయం, మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబు మాదిగ, ఇతర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆదర్శ బాలికల హాస్టల్ సందర్శించిన మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని ఆదర్శ బాలికల హాస్టల్‌ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ సందర్శించారు. విద్యార్థినులతో కలసి భోజనం చేసి, వారి అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచి, నాణ్యమైన భోజనం అందిస్తోంది. విద్యార్థినులు పోటీ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను” అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదిగొండ రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, హాస్టల్ సిబ్బంది మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైశ్య సేవా కేంద్ర జిల్లా అధ్యక్షుడు చిత్తూరు సురేష్ సమక్షంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం




**జగిత్యాల, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల జిల్లా గోవిందారం, ధర్మపురి గ్రామాలకు చెందిన 75 మంది నిరుపేద రోగులకు ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరాన్ని మన రేకుర్తి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా క్యాటరాక్ట్ సర్జరీలు చేయబడగా, శస్త్ర చికిత్స అనంతరం వారికి అవసరమైన ఔషధాలు, కంటి సంరక్షణకు సంబంధించిన సూచనలు అందించారు. రోగులను తిరిగి వారి ఊర్లకు పంపే ముందు వైద్యులు ప్రత్యేకంగా కంటి సంరక్షణ పద్ధతులు, ఆహారపు అలవాట్లు, శస్త్ర చికిత్స తర్వాత పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్ర జిల్లా అధ్యక్షుడు చిత్తూరు సురేష్ సమక్షంగా, లయన్ చిదురు సురేష్ (పూర్వ జిల్లా గవర్నర్, వైస్ చైర్మన్ రేకుర్తి కంటి ఆసుపత్రి) పాల్గొని రోగులను ధైర్యం చెప్పి, ఆసుపత్రి వైద్యుల సేవలను ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ, సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నట్లు కంటి వెలుగు మనిషి జీవితానికి అత్యంత ముఖ్యమని, నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్సలు అందించడం సమాజ సేవలో గొప్ప భాగమని అన్నారు. ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు చేరువ కావడం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఇలాంటి ఉచిత శిబిరాలు నిర్వహించి, ప్రజలకు వైద్య సహాయం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

## కాపు భవనంలో ఘనంగా వంగవీటి మోహనరంగా విగ్రహ ప్రారంభోత్సవం



**వనస్థలిపురం, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనస్థలిపురం కాపు భవనంలో కీర్తిశేషులు వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహ ప్రారంభోత్సవ మహోత్సవం ఆదివారం ఉదయం 11:30 గంటలకు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆయన కుమారుడు వంగవీటి రాధా చేతుల మీదుగా ప్రారంభించారు. కాపు సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వర్ (జె.వి.ఆర్), దంతాల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి సెల్ అధ్యక్షుడు తూము వినయ్ కుమార్, సుబ్బరాయుడు, హరికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు. సభికులు వంగవీటి మోహనరంగా సేవలను స్మరించుకుంటూ ఆయన విగ్రహ ప్రారంభోత్సవాన్ని చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. కాపు సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలో పాల్గొన్న నాయకులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.


## షాద్‌నగర్ మిలీనియం టౌన్షిప్‌లో డిసిపి కార్యాలయం ప్రారంభం




**షాద్‌నగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాద్‌నగర్ మిలీనియం టౌన్షిప్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ఆదివారం లాంఛనంగా ప్రారంభమైంది. డిసిపి శిరీష రాఘవేందర్ ఈ కార్యాలయంలో ఇకపై ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఇటీవలే ప్రభుత్వం షాద్‌నగర్ ప్రాంతానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్థాయిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పట్టణంలో శాశ్వత కార్యాలయం ఏర్పాటు కోసం స్థల పరిశీలన త్వరలోనే చేపడతామని అధికారులు తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా, సమస్యల పరిష్కారానికి వేగవంతంగా స్పందించేందుకు ఈ కార్యాలయం కీలకంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.


# ఖమేనీ హత్యను ఖండించిన రష్యా అధ్యక్షుడు పుతిన్..

### కుటుంబానికి సంతాపం



**మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ హత్యను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఖండించారు. ఖమేనీ హత్య నిరంకుశ చర్యగా అభివర్ణించారు. ఈ మేరకు ఆదివారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమేనీ హత్య నిరంకుశమైంది. నైతిక విలువలు, అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘించి హత్య చేశారు. ఖమేనీ కుటుంబానికి, ఆయన సన్నిహితులకు నా ప్రగాఢ సానుభూతి. రష్యా ఎప్పుడూ ఖమేనీని గుర్తుంచుకుంటుంది. ఆయన తన అద్భుతమైన పాలనతో ఇరుదేశాల మధ్య సంబంధాల పెంపునకు కృషి చేశారు" అంటూ పుతిన్ పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు పుతిన్ తన సంతాప సందేశాన్ని పంపించారు. ఖమేనీ హత్యను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఇజ్రాయెల్, అమెరికా దాడిపై మాత్రం పుతిన్ స్పందించలేదు. అయితే, ఈ చర్యలు ఈ ప్రాంతంలో తీవ్ర సంక్షోభానికి, సంఘర్షణకు దారి తీయొచ్చని, అణు యుద్ధానికి దారి తీసే అవకాశం ఉందని సీనియర్ రష్యా దౌత్యవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఐక్యరాజ్యసమితిలోని రష్యా ప్రతినిధి వాసిలీ నెబెన్జియా మాట్లాడుతూ ఖమేనీ హత్యను ఖండించారు. ఇది దౌత్యపరమైన చర్యలకు వెన్నుపోటులాంటిదని వ్యాఖ్యానించారు. మరోవైపు ఇరాన్‌పై దాడులపై యూఏఈ ప్రెసిడెంట్ మొహమ్మద్ బిన్ జాయెద్ స్పందించారు. ఈ పరిస్థితికి ఇరానే కారణమన్నారు. పొరుగు దేశాలతో యుద్ధం చేసే బదులు, తెలివితో ఆలోచించాలని ఇరాన్‌కు సూచించారు.

## బుర్జ్ ఖలీఫాకు ఇన్సూరెన్స్ ఉందా.. ఇరాన్ దాడి నేపథ్యంలో ఇన్సూరెన్స్‌పై చర్చ



**న్యూఢిల్లీ మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దుబాయ్‌లోని అమెరికాకు చెందిన సైనిక స్థావరాలపై ఇరాన్ దాడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో అక్కడి ప్రముఖ బుర్జ్ ఖలీఫాపై కూడా ఇరాన్ క్షిపణుల ప్రయోగం జరిగింది. ఒకవేళ నిజంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన బిల్డింగ్ అయిన బుర్జ్ ఖలీఫాపై దాడి జరిగితే పరిస్థితి ఏంటి..? ఆ బిల్డింగ్‌కు ఇన్సూరెన్స్ ఉందా..? ఈ అంశంపై ఇప్పుడో ఆసక్తికర చర్చ జరుగుతోంది. స్థానిక మీడియా నుంచి అందుతున్న సమాచారం ప్రకారం బుర్జ్ ఖలీఫాకు ఇన్సూరెన్స్ ఉంది. ఈ బిల్డింగ్ డెవలపర్ దీనికి ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఏదైనా డ్యామేజ్ జరిగితే వర్తించేలా ప్రాపర్టీ ప్రొటెక్షన్, పొలిటికల్ వయొలెన్స్‌కు సంబంధించి బుర్జ్ ఖలీఫాకు ఇన్సూరెన్స్ ఉంది. ఒక ప్రముఖ కంపెనీతో ఈ మేరకు ఒప్పందం ఉంది. తీవ్రవాద దాడులు, ఇతర దాడులు, ముప్పు నుంచి ఇన్సూరెన్స్ లభిస్తుంది. అయితే, అది పూర్తిగా లభిస్తుందా లేదా అనేది తెలియదు. ఈ బిల్డింగ్‌కు సంబంధించి డెవలపర్ చేసిన ఇన్సూరెన్స్ మాత్రమే కాకుండా అందులోని పలు అపార్ట్‌మెంట్లు ఓనర్లు, హోటల్స్, రెస్టారెంట్స్, ఆఫీసెస్ వంటి వాటి యాజమాన్యాలు కూడా సెపరేట్‌గా ఇన్సూరెన్స్ కలిగి ఉన్నారు. బుర్జ్ ఖలీఫా రీప్లేస్‌మెంట్ విలువ ఒరిజినల్ కన్నా ఎక్కువగా ఉండొచ్చని అంచనా. అయితే, ఇలాంటి యుద్ధ పరిస్థితుల్లో ఎలాంటి ఇన్సూరెన్స్ వర్తిస్తుందనేదే సమస్య. ముఖ్యంగా మిలిటరీ దాడుల్లో నష్టం జరిగితే ఇన్సూరెన్స్ వర్తించేలా ఉంటేనే అది లభిస్తుంది. దీనికి ఉన్న పరిమితులు, నిబంధనల్ని అనుసరించి మాత్రమే కవరేజ్ లభిస్తుంది. అది కూడా పాక్షికంగానా లేదా పూర్తిగానే అనేది కూడా తెలియదు. ఇక ప్రస్తుతం దుబాయ్‌పై ఇరాన్ క్షిపణి దాడులు చేస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ కూడా మిస్సైల్స్‌తో విరుచుకుపడుతోంది. యుద్ధం నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో బుర్జ్ ఖలీఫా రక్షణపై ఆందోళన కలుగుతోంది.

## దుబాయ్‌లో చిక్కుకున్నాం.. స్వదేశం వెళ్లేందుకు సాయం చేయండి..!



**న్యూఢిల్లీ మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్ సైనిక దాడులతో పశ్చిమాసియా వణికిపోతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు యుద్ధం పాకడంతో.. దుబాయ్‌లోని వారంతా వణికిపోతున్నారు. అక్కడే చిక్కుకున్న పలువురు ప్రాణ భయంతో మమ్మల్ని కాపాడండి అని మొరపెట్టుకుంటున్నారు. యుద్ధ వాతావరణం నెలకొన్న దుబాయ్‌లోనే ఇంగండ్ల జూనియర్ జట్టు కూడా ఉండిపోయింది. దాంతో.. తమను కాపాడాలని మాజీ ఓపెనర్ జానీ బెయిర్‌స్టో ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శనివారం నుంచి యుద్ధ తీవ్రత కొనసాగుతోంది. యూఏఈలోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల దాడులకు తెగబడుతోంది. ఈ క్రమంలోనే దుబాయ్‌లోనూ బాంబుల వర్షం కురిపిస్తోంది. అయితే.. క్రికెట్ మ్యాచ్‌కోసం వచ్చిన ఇంగ్లండ్ లయన్స్ జట్టు విమానాల రద్దు కారణంగా ఇక్కడే చిక్కుకుపోయింది. దాంతో.. భద్రతపై అందరిలో ఆందోళన నెలకొన్నందున జానీ బెయిర్‌స్టో సోషల్ మీడియాలో పోస్ట్‌తో తమ పరిస్థితిని వివరించాడు. ఎమిరేట్స్.. చివరి ఫ్లైట్ రద్దయ్యాక తదుపరి విమానం ఎప్పుడు? అనే సమాచారం మాకు అందలేదు. విమాన సంస్థను సంప్రదించేందుకు చాలా ప్రయత్నించాం. కానీ, ఉపయోగం లేదు. దయచేసి ఎవరైనా మాకు సాయం చేయండి. దుబాయ్‌లో ఎవరికైనా ఫ్లైట్ సమాచారం తెలిసి ఉంటే మమ్మల్ని సంప్రదించండి' అని బెయిర్‌స్టో తన పోస్ట్‌లో అభ్యర్థించాడు. మాజీ ఆటగాడు ఆండ్రూ ఫ్లింటాఫ్‌తో కలిసి ఇంగ్లండ్ లయన్స్ కోచ్‌గా అబుధాబీ వచ్చిన బెయిర్‌స్టో తమను సురక్షితంగా తరలించాలని ప్రాధేయపడుతున్నారు. అతడి పోస్ట్‌పై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డుగానీ, యూఏఈ ప్రభుత్వంగానీ ఇంకా స్పందించలేదు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, బాలీవుడ్ నటి సోనాలీ చౌహాన్.. 'మేము దుబాయ్‌లో చిక్కుకున్నాం. ఇక్కడ పరిస్థితి భయానకంగా ఉంది.

## పెద్దపల్లికి చేరుకున్న మాజీ మావోయిస్టు నేత మల్లోజుల వేణుగోపాలరావు



**పెద్దపల్లి, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దశాబ్దాల పాటు అజ్ఞాతంలో ఉన్న మల్లోజుల వేణుగోపాలరావు, గత సంవత్సరం అక్టోబర్ 14న మహారాష్ట్ర గడ్చిరోలిలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోయిన విషయం తెలిసిందే. సిపిఐ (మావోయిస్ట్) పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, అలాగే పార్టీ అధికార ప్రతినిధిగా ఆయన పనిచేశారు. 2010లో ఆజాద్ మరణం తర్వాత 'అభయ్' పేరుతో అధికార ప్రతినిధి బాధ్యతలు చేపట్టిన వేణుగోపాలరావు, ప్రముఖ మావోయిస్టు నేత దివంగత మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్ జీ) తమ్ముడు. సుమారు 44 ఏళ్ల పాటు అండర్‌గ్రౌండ్‌లో గడిపిన ఆయన, జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత తొలిసారి పెద్దపల్లి పట్టణానికి వచ్చారు. స్థానికులు ఆయనను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, కొత్త జీవన ప్రయాణంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# బిజినెస్

## ఇరాన్-ఇజ్రాయెల్ వార్..
## గంటల్లోనే బంగారం ధరలు తారుమారు..

**ట్విస్ట్ ఇచ్చిన రేట్లు.. లేటెస్ట్ ధరలు ఇలా..**



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధంతో బంగారం ధరలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. ఆదివారం బంగారం, వెండి ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. ఖమేనీ మరణించినట్లు వార్తలు వెలువడంతో పసిడి ధరలు భారీగా పెరిగాయి. ఒక్కరోజే గోల్డ్ రేటు రూ.4 వేలకుపైగా పెరిగి షాకిచ్చింది. నెల ప్రారంభంలోనే మార్చి 1న బంగారం ధరలు పెరగ్గా.. సోమవారం బంగారం ధరలు సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్లవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఆదివారం బంగారం ధర రూ.4 వేలకుపైగా పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1,73,080 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,68,710గా ఉండగా.. ఈ రోజు రూ.4,370 పెరిగింది. ఇక 22 క్యారెట్ల రేటు ఇప్పుడు రూ.1,58,650గా ఉండగా.. శనివారం రూ.1,54,650 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.4 వేలు పెరిగింది.ఇక విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలే కొనసాగుతున్నాయి. అటు చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,72,090గా ఉండగా.. శనివారం రూ.1,69,640 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.2450 పెరిగింది. ఇక చెన్నైలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,750గా ఉండగా.. నిన్న రూ.1,55,500 వద్ద స్థిరపడింది.బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ బంగారం ధర రూ.1,73,080గా ఉండగా.. నిన్న రూ.1,68,710 వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,58,650గా ఉండగా.. నిన్న రూ.1,54,650 వద్ద స్థిరపడింది. ఇక ఢిల్లీలో 24 క్యారెట్లు రూ.1,73,230గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,58,800గా ఉంది.ఇక వెండి ధరలు రూ.5 వేలు పెరిగాయి. ప్రస్తుతం ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది. హైదరాబాద్‌లో కేజీ వెండిపై ఇవాళ రూ.5 వేలు పెరిగింది. ప్రస్తుతం కేజీ వెండి రూ.3.25 లక్షలు ఉండగా.. నిన్న రూ.3.20 లక్షలుగా ఉంది. ఇక చెన్నై, బెంగళూరులో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

## రాప్తే.హెచ్‌వీ నుంచి సరికొత్త బైకు

**ప్రారంభ ధర రూ.2.39 లక్షలు**



**చెన్నై,**

ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ రాప్తే.హెచ్‌వీ..దేశీయ మార్కెట్లోకి నయా బైకును విడుదల చేసింది. టీ30 పేరుతో విడుదల చేసిన ఈ మోటర్‌సైకిల్ ప్రారంభ ధర రూ.2.39 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. సింగిల్ చార్జింగ్‌తో 200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించనున్నది. 3.5 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. ప్రస్తుతం ఈ బైకులు దక్షిణాది మార్కెట్లో మాత్రమే విక్రయిస్తున్నట్టు, భవిష్యత్తులో ఉత్తరాదిలోకి ప్రవేశించనున్నట్టు కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ దినేశ్ అర్జున్ తెలిపారు. ప్రస్తుతం చెన్నై, బెంగళూరులో ఈ బైకులు వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్నట్టు, ఆ తర్వాత హైదరాబాద్‌లో విడుదల చేయనున్నట్టు చెప్పారు.

## 10 సంవత్సరాల పాటు వారంటీతో వచ్చే స్కూటర్లు!



యాక్టివా 110 అత్యంత ఎక్కువ ప్రామాణిక వారంటీ వ్యవధిలో ఒకటి. 3 సంవత్సరాలు లేదా 36,000 కి.మీ. హోండా 10 సంవత్సరాల వరకు కవరేజీని పొడిగించిన వారంటీ ప్యాకేజీని కూడా అందిస్తుంది. ఇది ప్రామాణిక 3 సంవత్సరాలకు పైగా అదనంగా 7 సంవత్సరాల కవరేజీని అందిస్తుంది.బర్గ్‌మాన్ స్కూటర్ 2 సంవత్సరాలు లేదా 24,000 కిలోమీటర్ల ప్రామాణిక వారంటీతో వస్తుంది. కస్టమర్లు సుమారు రూ.1,250కు 7 సంవత్సరాల పొడిగించిన వారంటీని లేదా సుమారు రూ.1,800 కు 10 సంవత్సరాల పొడిగించిన వారంటీని కూడా ఎంచుకోవచ్చు.జూపిటర్ 110 మరొక ప్రసిద్ధ స్కూటర్. ఇది 2 సంవత్సరాలు లేదా 24,000 కిలోమీటర్ల ప్రామాణిక వారంటీతో వస్తుంది. ఊబ దాని అన్ని 110బీబీ, అంతకంటే ఎక్కువ స్కూటర్ మోడళ్లపై 5 సంవత్సరాల వరకు పొడిగించిన వారంటీ ప్యాకేజీని కూడా అందిస్తుంది.యాక్సెస్ 125 మరోసారి 2 సంవత్సరాలు లేదా 24,000 కి.మీ ప్రామాణిక వారంటీతో వస్తుంది. బర్గ్‌మ్యాన్‌లో చూసినట్లుగానే 7 సంవత్సరాలు లేదా 10 సంవత్సరాల పొడిగించిన వారంటీ కూడా అందుబాటులో ఉంది.డెస్టిని 110 స్కూటర్ 5 సంవత్సరాలు లేదా 50,000 కిలోమీటర్ల పరిశ్రమ-ప్రముఖ ప్రామాణిక వారంటీతో వస్తుంది. ఇదే వారంటీ అన్ని ఇతర హీరో మోటోకార్ప్ స్కూటర్ మోడళ్లకు వర్తిస్తుంది. అలాగే మోటార్ సైకిళ్ళు కూడా 5 సంవత్సరాలు లేదా 70,000 కిలోమీటర్ల ప్రామాణిక వారంటీతో వస్తాయి.

## బ్రెవిస్, స్టబ్స్ ధనాధన్..
## ఏడో విజయంతో సెమీస్‌కు దక్షిణాఫ్రికా..!



పొట్టి ప్రపంచకప్‌లో ఆధిపత్యం కొనసాగిస్తున్న దక్షిణాఫ్రికా అజేయంగా సెమీస్‌కు దూసుకెళ్లింది. నాకౌట్ దశలో బలమైన భారత్, వెస్టిండీస్‌ను చిత్తు చేసిన సఫారీ టీమ్.. ఆదివారం చివరి మ్యాచ్‌లోనూ పంజా విసిరింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను వణికిస్తూ.. 5 వికెట్లతో జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో డెవాల్డ్ బ్రెవిస్(41) రెచ్చిపోగా.. జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయతీరాలకు చేర్చారు.రెండేళ్ల క్రితం బార్బడోస్‌లో చేజారిన ప్రపంచకప్‌ను పట్టేసేందుకు దక్షిణాఫ్రికా ఒక్కో అడుగు బలంగా వేస్తోంది. లీగ్ దశను అజేయంగా.. అపై నాకౌట్‌లోనూ వరుస విజయాలతో గ్రూప్ ఏ నుంచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన ఆ జట్టు చివరి మ్యాచ్‌లోనూ గర్జించింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను ఉతికేసింది.

తొలుత ప్రత్యర్థిని 153కే కట్టడి చేసిన సఫారీలు.. ఆపై ధనాధన్ ఆటతో లక్ష్యాన్ని కరిగించారు. డెవాల్డ్ బ్రెవిస్(ట తన స్టయిల్ విధ్వంసంతో విరుచుకపడి జింబాబ్వేను ఒత్తిడిలో పడేశాడు. సికిందర్ రజా(3-29) విజృంభణతో టాపార్డర్ కుప్పకూలినా.. జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో ప్రొటీస్ విజయాన్ని పరిపూర్ణం చేశారు. దాంతో.. 5 వికెట్ల తేడాతో గెలుపొందిన మర్క్‌రమ్ సేన ఏడు విజయాలతో సెమీస్ సమరానికి సై అంటోంది.

**18కే మూడు వికెట్లు**

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ క్వింటన్ డికాక్(0)ను వెనక్కి పంపిన సికిందర్ రజా(3-29) వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. స్లో డెలివరీతో ఎడెన్ మర్క్‌రమ్(4)ను బౌల్డ్ చేసిన జింబాబ్వే సారథి.. సఫారీ హిట్టర్లను నిలువరిస్తున్నాడు. 18కే మూడు వికెట్లు పడినా.. డెవిడ్ మిల్లర్(22), డెవాల్డ్ బ్రెవిస్(41)లు దూకుడైన ఆటతో జింబాబ్వే బౌలర్లను హడలెత్తించారు. మిల్లర్‌ను ముజరబని బోల్తా కొట్టించగా.. సిక్సర్లతో చెలరేగుతున్న బ్రెవిస్‌ను రజా పెవిలియన్ చేర్చాడు. దాంతో.. 101 వద్ద దక్షిణాఫ్రికా ఐదో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. మరో వికెట్ పడకుండా చూసుకుంటూనే.. 50 ప్లస్ భాగస్వామ్యంతో 17.5 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

**రజా ఒక్కడే**

లీగ్ ఆసాంతం.. ఆపై.. నాకౌట్ తొలి రెండు మ్యాచుల్లో శుభారంభాలు ఇచ్చిన బంగ్లాదేశ్ ఓపెనర్లు దక్షిణాఫ్రికాపై మాత్రం తేలిపోయారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(15), మరుమని(7)లు విఫలమవ్వడంతో జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నాడు కెప్టెన్ సికిందర్ రజా74). సఫారీ పేస్, స్పిన్ దళాన్నిదీటుగా ఎదుర్కొన్న అతడు.. జట్టు స్కోర్ 120 దాటించి వెనుదిరిగాడు. ఆఖర్లో మెరుపులతో జింబాబ్వే ప్రత్యర్థి ముందు 154 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది.

# స్పోర్ట్స్

## విశ్వవిజేతగా తొలి పరాభవం..

**వన్డే సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్..!**



వన్డే ఛాంపియన్ భారత జట్టు కు ఘోర పరాభవం ఎదురైంది. ఆస్ట్రేలియా గడ్డపై పొట్టి సిరీస్ గెలుపొందిన టీమిండియా.. వన్డే ఫార్మాట్లో మాత్రం చతికిలపడింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. మూడో వన్డేలోనూ చేతులెత్తేసింది. అలీసా హీలీ(158) వీడ్కోలు సెంచరీతో.. సథర్‌లాండ్(106) మెరుపులతో ఆసీస్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించగా.. భారత స్టార్లు కనీస పోరాటం చేయలేదు. ఫలితంగా.. 185 పరుగుల దారుణ ఓటమి మూగట్టుకుందిఆస్ట్రేలియా గడ్డపై పొట్టి సిరీస్ పట్టేసిన భారత మహిళల జట్టు వన్డేల్లో మాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. తొలి రెండు వన్డేల్లో ఓడిన టీమిండియా.. నామమాత్రమైన మూడో మ్యాచ్‌లోనూ దాసోహమైంది. తొలుత అలీసా హీలీ(158), అనాబెల్ సథర్‌లాండ్(106)ల ఊచకోతతో ప్రత్యర్థికి 409 పరుగులభారీ స్కోర్ సమర్పించుకున్న భారత్.. బ్యాటింగ్ విభాగంలోనూ సమిష్టిగా విఫలమైంది.

**62 వద్ద రెండో వికెట్**

రికార్డు ఛేదనలో భారత జట్టుకు ఆదిలోనే నికోలా కారీ షాకిచ్చింది. ఓపెనర్ స్మృతి మంధాన(0)ను డకౌట్‌గా పెవిలియన్ పంపిన తను.. తొలి వికెట్ అందించగా.. ప్రతీకా రావల్(27)ను సథర్‌లాండ్ ఔట్ చేసింది. 62 వద్ద రెండో వికెట్ పడిన వేళ.. జెమీమా రోడ్రిగ్స్()42, హర్మన్‌ప్రీత్ కౌర్(25)లు భాగస్వామ్యం నిర్మించే ప్రయత్నం చేశారు. జెమీమాను అష్లీ గార్డ్‌నర్ ఔట్ చేసిన కాసేపటికే అలనా కింగ్(4-33)కు వికెట్ల ముందు హర్మన్‌ప్రీత్ దొరికిపోయింది. అంతే.. అక్కడి నుంచి భారత్ కోలుకోలేకపోయింది.రీచా గోష్(18), హర్లీన్ డియోల్(14) ఆసీస్ బౌలర్లను కాచుకొని స్కోర్ బోర్డును నడిపించినా.. లోయర్ ఆర్డర్‌ను అలనా కింగ్ దెబ్బకొట్టింది. ఆఖర్లో స్నేహ్ రానా(44) పోరాడినా.. అప్పటికే ఓటమి ఖాయమైంది శ్రీచరణ(11)ని ఔట్ చేయడంతో భారత ఇన్నింగ్స్ 224 వద్దే ముగిసింది. 185 పరుగులు తేడాతో గెలుపొందిన కంగారూ టీమ్ 3-0తో సిరీస్‌ను ఒడిసిపట్టింది.

## పారా బాడ్మింటన్ జాతీయ
## స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక



**విజయనగరం టౌన్**

పారా బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన 7 వ పారా బాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన యాళ్ళ సత్తిబాబు (కొత్తవలస ) ఎస్. యూ. 5 కేటగిరి మెన్ సింగిల్స్, డబల్స్ లోనూ, ఆరికతోట నాగభూషణరావు (బబ్బిలి) వీల్ చైర్ 2 కేటగిరి మెన్ సింగిల్స్‌లోనూ, సుంకర లీల (నెల్లిమర్ల) ఎస్.ఎల్.4 కేటగిరి ఉమెన్ సింగిల్స్ లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మార్చి 6 నుండి 10 వరకు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో జాతీయ స్థాయి పోటీలు జరుగనున్నాయి. త్వరలో వీరంతా బయలుదేరి వెళ్ళనున్నారు .జాతీయ స్థాయి పోటీలలోనూ సత్తా చాటి జిల్లాకు, రాష్ట్రానికీ మరింత పేరు తీసుకుని రావాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.దయానంద్ అకాంక్షించారు.